క్లుప్తంగా

ఇబ్బందులు కలగకుండా చర్యలు



చిన్నచింతకుంట: ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతామని డీఈఓ రవీందర్ తెలిపారు. శనివారం ఉంద్యాల జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. త్వరలోనే ఉంద్యాల పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తామని తెలిపారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోండి

మహమ్మదాబాద్: కొత్తగా భూములు పట్టాలు చేయించుకుని రైతుబీమా పథకం వర్తించని వారు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఫణీషా తెలిపారు. 2023 జూన్ 28 నుంచి 2024 జూన్ 28వరకు కొత్తగా పట్టాలు చేసుకున్న రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రుణమాఫీపై ఎలాంటి సందేహాలు ఉన్నా ఏఈఓను సంప్రదించాలని కోరారు.

హైస్కూల్ సమయం మార్చొద్దు

జడ్చర్ల టౌన్: హైస్కూల్ సమయం మారుస్తు ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ సరైంది కాదని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నాయక్ శనివారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సుదూర గ్రామాలు, తండాల నుంచి 3, 4 కి.మీ నడిచి విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారని తెలిపారు. వారికి ఆటోలు, బస్సులు అందుబాటులో ఉండవని, కొన్ని పాఠశాలల విద్యార్థులు బస్సులు, ఆటోల ద్వారా వస్తుంటారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామని అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కువ జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థుల వివరాలను జిల్లా కేంద్రంలోని నవ భారతి విద్యాలయంలో ఈనెల 26వ తేదీలోగా అందించాలని కోరారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



దేవరకద్ర: మండలంలోని చౌదర్‌పల్లి, నాగారం ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ జయశ్రీ శనివారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ప్రతి విద్యార్థికి అందించాలని, నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. అనంతరం ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిన్నచింతకుంట: కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణయ్య సూచించారు. శనివారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మట్టి మిద్దెలు, గుడిసెలలో నివాసం ఉంటున్న ప్రజలు ప్రభుత్వ భవనాలలో, పంచాయతీ, కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ పాఠశాలల్లోని సురక్షిత ప్రాంతాలలోకి చేరాలన్నారు.

పాత ఇళ్లలో ఉండొద్దు

నవాబుపేట: పాత ఇళ్లలో ప్రజలు ఉండకూడదని తహసీల్దార్ నాన్యనాయక్ తెలిపారు. ముసురు వర్షంపై ఆయన శనివారం మాట్లాడుతూ.. గ్రామాల్లో పాత ఇళ్లను గుర్తించేలా ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కాగా వర్షాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూర్తిగా నిరాశ్రయులుగా ఉంటే వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేసేలా చూస్తున్నామని తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు

జడ్చర్ల: పట్టణంలోని 14వ వార్డు సంజీవయ్య కాలనీలో శుక్రవారం రాత్రి ముసురు వర్షానికి మంజులకు చెందిన ఇంటి ముందు గోడ, రేకుల కప్పు కూలిపోయింది. ఆ సమయంలో కప్పు కింద ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. మున్సిపల్ కమిషనర్ రాజయ్య ఘటనా స్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాలను చేపట్టారు.

పారిశుద్ధ్య పనులు

దేవరకద్ర: మేజర్ పంచాయతీ పరిధిలో శనివారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. దేవరకద్ర ఆర్‌ఓబీపై గడ్డిని, నీరు పోయే పైపుల వద్ద పేరుకు పోయిన చెత్తను తీశారు. అలాగే దేవరకద్ర బస్టాండ్, పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్తను, గడ్డిని, పేరుకు పోయిన మట్టిని తొలగించే పనులు పెద్ద ఎత్తున చేపట్టారు.

సత్వర పరిష్కారానికి చర్యలు

- మున్సిపాలిటీలో ఎమర్జెన్సీ రిస్క్ టీం ఏర్పాటు
- శిథిలమైన ఇళ్లను గుర్తించి కుటుంబాలను తరలించే యత్నం



వార్డు అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ సొంటి రాజయ్య

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు కమిషనర్ సొంటి రాజయ్యను కోరారు. ఈనెల 25న చైర్‌పర్సన్ అవిశ్వాస సమావేశం ఉండటంతో మున్సిపాలిటీలో పాలకవర్గంలో స్తబ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశమైన కౌన్సిలర్లు కుమ్మరి రాజు, ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్‌గౌడ్, ఉమాశంకర్‌గౌడ్, చైతన్యచౌహాన్, బుక్కమహేష్, అలూరి శశికిరణ్ పలు సమస్యలపై చర్చించారు. శుక్రవారం సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై వారు స్పందించారు. మున్సిపాలిటీలో సమస్యలు పెరుగుతుండటంతో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అనంతరం వారు మున్సిపల్ కమిషనర్‌ను కలుసుకుని సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా వర్షాలకు శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వాటిలోనుంచి ఆయా కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. వర్షాల కారణంగా అంతర్గత రోడ్లు దెబ్బతినటంతో, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయించాలని కోరారు. మున్సిపాలిటీలో అవసరం అయితే రిస్క్ టీం ఏర్పాటు చేయాలని సూచించారు. కుక్కల బెడద తీర్చేందుకు తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. స్పందించిన మున్సిపల్ కమీషనర్ ఎమర్జెన్సీ రిస్క్ టీం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అందుబాటులో ఉన్న వార్డు అధికారులను పిలిపించి వారికి పలు సూచనలు జారీ చేశారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. ఆ ఇళ్లల్లో ఉన్నవారికి నచ్చచెప్పి సురక్షిత ప్రాంతాలకు పంపించాలన్నారు. మురికి నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ ఏఈ భాస్కర్, సిబ్బందితో సమావేశం నిర్వహించి వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 'సాక్షి ఫోన్ ఇన్'కు వచ్చిన సమస్యలలో తక్షణమే పరిష్కరించగలిగేవి గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.

వార్డుల్లో కౌన్సిలర్లు పర్యటన..

కౌన్సిలర్లు వారి పరిధిలోని వార్డుల్లో శనివారం పర్యటించారు. 9వవార్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలో నివాసం ఉంటున్న జంగాల గుడిసెల్లోకి వరదనీరు రావటంతో కౌన్సిలర్ చైతన్య చౌహాన్ జేసీబీ సాయంతో నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టారు.

నేడు గురు పౌర్ణమి వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని పలు ఆలయాల్లో వేడుకలు నిర్వహించనున్నారు. గణేష్‌నగర్‌లోని షిరిడీసాయి బాబా ఆలయంలో ఉదయం విశేష అభిషేకాలు, సాయివ్రతం, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించనున్నారు. అదేవిధంగా టీటీడీ కల్యాణ మండపంలో గురు పూజోత్సవం నిర్వహించనున్నారు. పట్టణంలోని ఇతర ఆలయాల్లో కూడా వేడుకల కోసం ఏర్పాట్లు చేశారు.

బాబా మందిరంలో ప్రత్యేక పూజలు

జిల్లా కేంద్రం జెడ్పీ మైదానం పక్కన ఉన్న షిరిడీ సాయి ద్వారకామయిబాబా మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం అభిషేకాలు, మహాగణపతిపూజ, అఖండ దీపారాధన, అంకురారోహణం, ప్రధాన కలశపూజ, మహా మంగళహారతి నిర్వహించారు. ఆదివారం మందిరంలో గురుపూర్ణిమ వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. అష్టోతర శత క్షీర కుంభాభిషేకం, సామూహిక సాయి వ్రతాలతోపాటు సాయంత్రం పల్లకీ సేవ నిర్వహిస్తారు. పూజల్లో అర్చకులు, సేవాదళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో బాబా వారికి హారతి ఇస్తున్న అర్చకుడు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో శనివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. తెలుగు పండితుడు గోనెల రవిశంకర్ భారతమాత, సరస్వతిదేవి చిత్రపటాలకు పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నవాబుపేట: గురుపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని సాయి కొండ, గురుకుంటలోని సాయినాథ్ ఆలయాల్లో పూజలను నిర్వహకులు ప్రారంభించారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా సాయి వ్రతాలు, సాయినామార్చన, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

శిథిలావస్థలోని ఇళ్లను గుర్తిస్తున్న అధికారులు



మదీన మసీద్ ప్రాంతంలో పాత ఇంటిని ఖాళీ చేయాలని నోటీసు అందజేస్తున్న సిబ్బంది



పాత ఇంటిలో నివసిస్తున్న వారికి సూచలిస్తున్న చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని వివిధ ప్రాంతాలలో పాత ఇళ్లు, పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటిని మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ పరిశీలిస్తున్నారు. నివాసం ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు అందజేస్తున్నారు. సమీపంలోని కమ్యూనిటీ హాళ్లలో ఆశ్రయం పొందాలని సూచిస్తున్నారు. అందుకనుగుణంగా అన్ని వార్డులలో గల కమ్యూనిటీ హాళ్లను సిద్ధంగా ఉంచారు. అక్కడ ఆశ్రయం కల్పించి వారికి కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. తాజాగా శనివారం పాలిటెక్నిక్ ప్రాంతంలోని ఓ పాత ఇంటిని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఎంఈ బస్వరాజ్, ఏఈ వైష్ణవి పరిశీలించారు. అందులో నివసిస్తున్న వారిని వెంటనే సమీపంలోని కమ్యూనిటీహాల్‌కు వెళ్లాలని సూచించారు. అలాగే షాషాబ్ గుట్ట (19వ వార్డు) పరిధిలోని లంబాడితండాలో ఓ పాత ఇంట్లో నివాసం ఉంటున్న వారిని వేరే చోటకు మున్సిపల్ సిబ్బంది తరలించారు.

పిల్లలను ప్రభుత్వ బడికే పంపాలి



నసురుల్లాబాద్ స్కూల్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి

అడ్డాకుల: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడికే పంపాలని హెచ్ఎం ఎస్.వెంకటేష్ కోరారు. మండలంలోని పొన్నకల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య అందుతుందని, బడి నుంచి ఇంటికి వచ్చిన పిల్లల చదువులపై తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలని కోరారు. ప్రతి ఇంటిలో రీడింగ్ కార్నర్ ఏర్పాటు చేసి బడిలో చదివిన అంశాలను తల్లిదండ్రులు పరిశీలించాలని తెలిపారు. మొబైల్ ఫోన్‌లో 'ఇంటింటా చదువుల పంట' యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్, రవినాయక్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

గండీడ్: విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని హెచ్ఎం అరుణాదేవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. కేవలం చదువే కాక వారి క్రమశిక్షణ నడవడి ఎలా ఉందో అని దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

జడ్చర్ల టౌన్: విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. మండలంలోని నసురుల్లాబాద్ ప్రాథమిక పాఠశాలలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు తరుచూ పాఠశాలకు రావటం వల్ల విద్యార్థి చదువు గురించి తెలుసుకునే అవకాశం వస్తుందని, ఏవైనా లోపాలు ఉంటే వాటిని ఇంటివద్ద చక్కదిద్దే వీలవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వసంతకుమార్, కాంప్లెక్స్ హెచ్ఎం అనంతప్ప, నారాయణ పాల్గొన్నారు.

రహదారి పక్కన నీటి మడుగు

అడ్డాకుల: జాతీయ రహదారి పక్కన మూసాపేట మండలం తుంకినీపూర్ వెళ్లే రోడ్డు వద్ద మడుగును తలపించేలా నీళ్లు నిలుస్తున్నాయి. రహదారి పక్కనే గుంతలు ఏర్పడగా వాటిలో వర్షం నీళ్లు చేరాయి. రహదారికి ఆనుకుని నీళ్లు నిలుస్తున్నాయి. దానివల్ల ప్రధాన రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. వాహనాలు ఏమాత్రం పక్కకు వచ్చినా గుంతల్లో పడే పరిస్థితి ఉంది. రాత్రివేళ వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు నిర్వాహకులు స్పందించి గుంతలను పూడ్చి వేయించాల్సిన అవసరముంది.

తుంకినీపూర్ స్టేజీ వద్ద రహదారిని ఆనుకుని ఉన్న నీళ్లు



మార్కెట్ కమిటీ చైర్మన్లకు సన్మానం

చిన్నచింతకుంట: మండలంలోని దమగ్నాపూర్‌లో దేవరకద్ర, మదనాపురం మార్కెట్ కమిటీ కొత్త చైర్మన్లుగా ఎంపికైన కతలప్ప, పల్లెపాగు ప్రశాంత్‌ను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి శనివారం శాలువాలతో సత్కరించారు. రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, ధనుంజయ్, రవిగౌడ్, మంగ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయాన్ని శుభ్రం చేసిన ఉద్యోగులు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని అన్ని విభాగాలలో గదులను ఊడ్చి, బూజు దులిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, డీఈఈ బి.ఐ.బెంజిమన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వజ్రకుమార్‌రెడ్డి, గురులింగం, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని ఆహ్వానిస్తున్నాం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని తీసుకురావడాన్ని ఆహ్వానిస్తున్నట్లు టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాల్‌రాజ్, విజయభూషన్ శనివారం ప్రకటనలో తెలిపారు. కానీ అంగన్‌వాడీలలో 3వ తరగతి వరకు కొనసాగించడం సరైన విధానం కాదని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీని ప్రారంభించాలని, మూడో తరగతి వరకు అంగన్‌వాడీల్లో నడపవద్దని సూచించారు.

మాట ఇచ్చాం.. రుణమాఫీ చేస్తున్నాం



హన్వాడ: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిందని పార్టీ మండల అధ్యక్షుడు, మహేందర్, కృష్ణయ్య, షబ్బీర్ తెలిపారు. రైతు రుణమాఫీ సందర్భంగా హన్వాడ, వేపూర్‌లో రైతు సంబరాలను నాయకులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ రైతులకు ఏకకాలంలో రైతు రుణాలను మాఫీ చేశారు. నేడు అదే తరహాలో సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ చేసి రైతుల గుండెల్లో చెరగని ముద్ర వేశారన్నారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సుధాకర్, రాములు, చంద్రయ్య, యాదయ్య, సిర్పరవి, మహ్మద్‌ఖాజ, ఆంజనేయులు, అచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

నార్లోనికుంట్లలో..

దేవరకద్ర: మండలంలోని నార్లోనికుంట్లలో శనివారం పలువురు నాయకులు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామాంజనేయులు, రాఘవులు, పలువురు పాల్గొన్నారు.

వర్షంతో పనులకు ఆటంకం..

గండీడ్: మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. కొంరెడ్డిపల్లి, వెన్నాచేడ్, రంగారెడ్డిపల్లి, పెద్దవార్వాల్, రుసుంపల్లి, సాలార్‌నగర్, జిన్నారం, చెల్మిల్లా గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి వర్షం కురిసింది. పొలం పనులతో పాటు ఇతర పనులకు ఆటంకం కలిగింది. రైతులు నారుమళ్లు పెంచేందుకు తూకాలు చల్లారు. దీంతో మళ్లల్లో నీరు చేరి చల్లిన ధాన్యం సైతం కొట్టుకుపోయింది. నారు మళ్లల్లో నీరు నిండిపోవడంతో తొలగించడానికి నానా పాట్లు పడ్డారు. గ్రామాల్లో ఇళ్ల మధ్యలో సైతం నీళ్లు నిలిచాయి. కొన్ని చోట్ల పాఠశాల ఆవరణలో నీళ్లు నిలవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

చిన్నచింతకుంట: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దవడ్డేమాన్ అమ్మ ఆదర్శపాఠశాలలను తనిఖీ చేశారు. ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఎంపికైన పాఠశాలల్లో ఏవైన పెండింగ్ పనులు ఉంటే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, వైద్యుడు రాహుల్, ఎంపీఓ అనిల్‌కుమార్ ఉన్నారు.

బాధితులకు ఎస్పీ చేయూత



చెన్నమ్మకు సరకులు అందజేస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం/ మహమ్మదాబాద్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మహమ్మదాబాద్ మండలం నంచర్ల చెందిన చెన్నమ్మ ఇళ్లు పైకప్పు కూలిపోవడంతో ఎస్పీ జానకి శనివారం ఆమెను పరామర్శించారు. బియ్యం, రేషన్ సరుకులు, దుప్పట్లతో పాటు రూ.10వేలు అందించారు. అదేవిధంగా రాజాపూర్ మండలం చెన్నవెల్లి, మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేటలో ఇళ్లు కూలిపోయిన బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి నిత్యావసర సరుకులు ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్

అడ్డాకుల: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీపై అర్హులైన రైతులెవరూ ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం రుణమాఫీపై ఏంఎఓ శ్రీనివాసులు, ఏఈఓలతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా మాఫీ వర్తించిన రైతుల వివరాలపై ఆరా తీశారు. అంతకు ముందు స్థానిక ఎస్‌బీఐ వద్దకు వెళ్లి బ్యాంకు అధికారులతో మాట్లాడారు. రుణమాఫీ పొందిన రైతులకు కొత్తగా పంట రుణాలను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. రుణమాఫీ గురించి బ్యాంకు సిబ్బంది, అక్కడికి వచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు. మొదటి దశలో ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాలున్న రైతులకు మాఫీ చేసిందని, మిగిలిన రైతులకు రెండు దశల్లో మాఫీ చేస్తుందని తెలిపారు. రుణమాఫీ ఫిర్యాదులపై మండల వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాసులు, ఏఈఓలు తదితరులు ఉన్నారు.

గోల్కొండ బోనాల పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నవాబుపేట: గోల్కొండ ఎల్లమ్మతల్లి బోనాల కార్యక్రమ వాల్ పోస్టర్‌ను గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపాల్‌గౌడ్ శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లికి గౌడ సంఘం ద్వారా బోనం కల్లుసాకా కార్యక్రమం ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గౌడ కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొనేనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, రామకృష్ణగౌడ్, నర్సింహగౌడ్, చరణ్, భూపాల్‌గౌడ్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాడుతాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణ చేసి, చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన మాటను ఇప్పటి వరకు నిలబెట్టుకోలేదని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఎస్సీ వర్గీకరణను సత్వరం చేపట్టాలనే ప్రధాన డిమాండ్‌తో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మాదిగల మహాధర్నా చేస్తామని చెప్పారు. శనివారం తెలంగాణ చౌరస్తాలో మహా ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో అక్షర లక్ష గాయత్రి యజ్ఞం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం లోకకల్యాణార్థం కోసం సిద్ధంభట్ల వాసంతి, చంద్రశేఖర్ జ్యోషిలు అక్షరలక్ష గాయత్రి యజ్ఞం నిర్వహిస్తున్నారు. ఈ యజ్ఞం ఆదివారం పూర్ణాహుతితో ముగుస్తుందని తెలిపారు. 50 ఏళ్ల క్రితం గడియారం రామకృష్ణశర్మ యజ్ఞం చేపట్టారని పేర్కొన్నారు. 30 మంది రుత్వికులతో మహా యజ్ఞం చేస్తున్నారు. కార్యక్రమంలో తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, బుచ్చయ్య శాస్త్రి పాల్గొన్నారు.

ఉత్సాహంగా అవగాహన ర్యాలీ



గైరాన్‌గడ్డ తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్ రూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాతతోటలో అమ్మమాట- అంగన్‌వాడీ బాట అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, శైలజ పాల్గొన్నారు.

జడ్చర్ల: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని సూపర్‌వైజర్ అరుణ్‌జ్యోతి తెలిపారు. శనివారం మండలంలోని గైరాన్ గడ్డతండాలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండలంలోని గైరాన్‌తండలో శనివారం ర్యాలీ నిర్వహించి అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మదర్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణజ్యోతి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రోహిణీ, మాధవి పాల్గొని మాట్లాడారు. రెండున్నరేళ్లు దాటిన పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, కృష్ణమ్మ, మేఘమాల, భాగ్య, సునీత, సరస్వతి పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలోని వేముల, మసిగొండ్లపల్లిలో అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాణి, స్వరూప, జయంతి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.